ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 16.04.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఐటి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు యూఎస్ నేషనల్ వార్ కాలేజీ బృందాన్ని కోరారు.

2. వడదెబ్బ బాధితులకు వేగంగా చికిత్స అందించేందుకు వీలుగా అన్ని ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.

3. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, కుటుంబ సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ సంపూర్ణ డేటాను, నిపుణుల కమిటీ నివేదికను మంత్రి విడుదల చేశారు.

4. రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలను దేశ, విదేశ పర్యాటకులకు పరిచయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

**శ్రీధర్ బాబు**

హైదరాబాద్ లోని సచివాలయంలో ఈ ఉదయం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో యూఎస్ నేషనల్ వార్ కాలేజీ బృందం ప్రత్యేకంగా సమావేశం అయ్యింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో

ఉన్న అపారమైన పెట్టుబడి అవకాశాలు, అనుకూలతలను యూఎస్ బృందానికి వివరించారు. ఈ రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని మంత్రి కోరారు. యూఎస్ఏ, తెలంగాణ మధ్య ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో ద్వైపాక్షిక సహకారం పెంపొందించడంపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరిగింది.

డెస్క్

**దామోదర**

వడదెబ్బ బాధితులకు వేగంగా చికిత్స అందించేందుకు వీలుగా అన్ని ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా వైద్యబృందాలను ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నిన్న ప్రభుత్వ ఆసుతపత్రుల్లో ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. 'రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్‌పేషెంట్లు, ఇన్‌పేషెంట్లు, వారి అటెండెంట్లు, ఆసుపత్రి సిబ్బందికి తాగునీరు అందుబాటులో ఉంచాలని, అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. ఉక్కపోత సమస్య ఎక్కువ అవుతున్నందున.. ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లు అందుబాటులో ఉంచాలని, ఉపాధిహామీ కూలీలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కార్మికులను దృష్టిలో పెట్టుకుని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే, ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

డెస్క్

**సీపెక్**

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, కుటుంబ సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా సర్వే చేసి సామాజిక న్యాయం సాధించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆయన విజ్ఞప్తి చేశారు. మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ తో పాటు.. పలువురు ఉన్నతాధికారులతో కలిసి తెలంగాణ సామాజిక ఆర్థిక కుటుంబ సర్వే (సీపెక్) సంపూర్ణ

డేటాను, నిపుణుల కమిటీ నివేదికను సచివాలయంలో నిన్న రాత్రి విడుదల చేశారు. ఈ నివేదికలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లోనూ అప్‌లోడ్ చేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ సామాజిక, ఆర్థిక కుటుంబ సర్వేపై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు స్పందించాలని, వెనుకబాటుతనాన్ని తొలగించడానికి పార్టీలు, కుల సంఘాలిచ్చే సలహాలు, సూచనల్ని రాష్ట్ర ప్రభుత్వం స్వీకరిస్తుందని అన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ సామాజిక, ఆర్థిక, కుటుంబ సర్వేను ప్రవేశపెట్టి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని 1 కోటి 12 లక్షల 36 వేల 849 కుటుంబాలను సర్వే చేశామని, రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 97.10 శాతం కుటుంబాలు సర్వేలో పాల్గొన్నాయని వివరించారు. ఈ సర్వే కోసం లక్ష మందికి పైగా ఉద్యోగులు పనిచేశారని తెలిపారు.

డెస్క్

**వాకిటి**

కులగణన సమగ్ర సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. దశాబ్దాలుగా కులగణనపై కేవలం మాటలకే పరిమితమైన కొన్ని రాజకీయ పార్టీలు ఇప్పుడు విమర్శలు చేయడం హాస్యాస్పదమని మంత్రి అన్నారు. కులగణన డేటా ద్వారా వెనుకబడిన వర్గాల వాస్తవ పరిస్థితులు స్పష్టమవుతాయని, అభివృద్ధి పథకాలు నిజంగా అర్హులైన వారికి చేరడం సులభమవుతుందని మంత్రి తెలిపారు.

డెస్క్

**జూపల్లి**

రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలను దేశ, విదేశ పర్యాటకులకు పరిచయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి క్రుష్ణారావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సెవెన్ టూంబ్స్, కటోరా హౌస్, ఖజానా బిల్డింగ్ మ్యూజియంలను మంత్రి నిన్న పరిశీలించారు. కుతుబ్ షాహీ టూంబ్స్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను సమీక్షించిన మంత్రి వక్ఫ్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న అంశాలు మినహా మిగిలిన పనులన్నీ వారంలోగా

ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కుతుబ్ షాహీ టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కిలోమీటర్ల రోప్‌వే నిర్మాణ ప్రతిపాదనలు అనుమతుల దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. కటోరా హౌస్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, పరిసర ప్రాంతాల్లో వ్యర్థాలను వెంటనే తొలగించాలని GHMC అధికారులను ఆదేశించారు. గోల్కొండ సమీపంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి నేషనల్ మోనుమెంట్ మిషన్ అథారిటీకి పంపాలని సూచించారు. ఖజానా బిల్డింగ్ మ్యూజియంలో చేనేత వస్త్రాల ప్రదర్శన ఏర్పాటు చేయాలని, మ్యూజియం వెనక భాగంలోని అక్రమ నిర్మాణాలను వారంలోగా తొలగించాలని మంత్రి ఆదేశించారు.

డెస్క్

**భట్టి విక్రమార్క**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జగ్గారం, మల్లారం గ్రామాల్లో రెండు విద్యుత్ ఉప కేంద్రాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అశ్వారావుపేట నియోజకవర్గంలో విద్యుత్ డివిజన్ కేంద్ర మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 422 ఇండ్లకు సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు భట్టి వివరించారు.

పిటిసి, భద్రాద్రి కొత్తగూడెం

**పొంగులేటి**

భద్రాచలం రామాలయ మాడవీధుల విస్తరణ పనులు వేగవంతం చేసి వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. నిన్న సాయంత్రం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి మాడవీధుల డిజైనింగ్ పనులను ఆర్కిటెక్ బృందంతో కలిసి పరిశీలించిన ఆయన.. మాడవీధుల నిర్మాణానికి ఒక ఎకరం 28 గుంటల భూమిని సేకరించినట్లు తెలిపారు.

పిటిసి, భద్రాద్రి కొత్తగూడెం

**బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 ప్రకారం కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపట్టిందని బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. ఈరోజు మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ... ముస్లీం లీగ్, MIM లకు లబ్ది చేకూర్చడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు.

ఎం.ఎస్.ఎం

**కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్**

కరీంనగర్ ప్రజలకు త్రాగునీటి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ జిల్లా విద్యానగర్ లోని కేంద్ర ప్రభుత్వ 15 వ ఆర్థిక సంఘం సంబంధించిన నిధులతో మంచినీటి పైప్లైన్ నిర్మాణం కోసం భూమి పూజ చేసిన అనంతరం మేయర్ మాట్లాడుతూ...

**బైట్ ... కొలగాని శ్రీనివాస్, మేయర్, కరీంనగర్**

పిటిసి, కరీంనగర్

**వనపర్తి జిల్లా**

వనపర్తి జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా రూపొందించేందుకు అందరూ సహకరించాలని జిల్లా ప్రాంతీయ రవాణా శాఖ అధికారిణి మానస సూచించారు. ప్రజా పాలన - ప్రగతి నివేదికలో భాగంగా జరిగిన "అరైవ్ - అలైవ్" కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ...

సౌండ్ బైట్ ... మానస,ఆర్.టీ.ఓ, వనపర్తి

పిటిసి, వనపర్తి